

సిసిబికి రూ.30 కోట్లు మంజూరుకు మంత్రి హామీ



సత్యకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మండిపల్లి

ప్రజాశక్తి-రాయచోటి : తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు సమగ్ర సంరక్షణ అందించడానికి రాయచోటిలో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను (సిసిబి) ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరు చేయనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి హామీ ఇచ్చారు. భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ల ఏర్పాటు విధానం ద్వారా తీవ్రమైన కేసులకు చికిత్స అందించే సౌకర్యాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రవాణా, యువజ, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. క్రిటికల్, ట్రామా కేర్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా రోగులకు ప్రత్యేక సంరక్షణ, పర్యవేక్షణ అవసరం కాబట్టి, ప్రస్తుత ఐసియు సామర్థ్యం సరిపోదని అందువల్ల మెరుగైన పేషెంట్ కేర్ కోసం రాయచోటిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు రూ.30 కోట్ల మంజూరు చేయాలని కోరగా ఆరోగ్య శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి రూ.30 కోట్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి తెలిపారు.

'ఎపిజిబి'కీ ఎసరు!

అమరావతికి తరలింపు కుతంత్రం

మొన్న.. ఎంఎస్ఎంఇ, నేడు.. ఎపిజిబి.. రేపు..?

ఆందోళనలో ఎపిజిపి ఉద్యోగ సంఘాలు

రాష్ట్రంలోని కూటమి సర్కారు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయ తరలింపునకు ఎసరుపెట్టింది. ఇటీవల కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఎంఎస్ఎంఇ పార్కు తరలింపునకు జిఒ జారీ చేయడం, తాజాగా కడపలోని ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని బ్యాంకుల విలీనం పేరుతో అమరావతికి తరలించడానికి కుతంత్రం పన్నుతోంది. 2014 రాష్ట్ర విభజన అనంతరం నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఒక్కో జిల్లాను ఒక్కో తరహాలో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి హోదాలో అప్పటి సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. రాజధానిగా అమరావతి ప్రకటన అనంతరం ఇచ్చిన హామీలు, చేసిన బాసలు మరిచిపోయారు. ఇంతటితో ఆగకుండా రాయలసీమలోని రాష్ట్ర స్థాయి విభాగాల శాఖల ప్రధాన కార్యాలయాలను తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తరలించిన తరహాలో అమరావతికి తరలిస్తూ ప్రజల మనోభావాలతో ఆడుకుంటుండడం పట్ల ఉద్యోగ సంఘాలు మొదలు సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.




ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయ తరలింపునకు కుతంత్రం నడుస్తోంది. 1976లో రాయలసీమ గ్రామీణ బ్యాంకు పేరుతో గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడంలో భాగంగా కార్యకలాపాలకు శ్రీకారం చుట్టింది. 2006లో రాయలసీమ, అనంత, పినాకినీ బ్యాంకులను కలిపి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుగా మారింది. 18 ఏళ్లుగా చైతన్య గోదావరి, ఎపి వికాస్, చిత్తూరు సప్తగిరి బ్యాంకుల వ్యాపారాల కంటే మిగులుగా గ్రేటర్ రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 551 శాఖలు 2,850 ఉద్యోగులతో సేవలం దిస్తోంది. రూ.48 వేల కోట్ల టర్నోవర్‌తో కూడిన వ్యాపార కార్యకలాపాలను సాగిస్తోంది. రూ.25 వేల కోట్లు రుణాలు, రూ.22 వేల కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. అత్యధికంగా 85 శాతం మేర వ్యవసాయ రుణాలను ఏడు లక్షల మంది గ్రామీణ రైతులకు అందిస్తోంది. చైతన్య గోదావరి, ఎపి వికాస్, సప్తగిరి గ్రామీణ బ్యాంకులకు మించిన శాఖలతో, వ్యాపార కార్యకలాపాలు, ఆదాయం రీత్యా పెద్ద బ్యాంకుగా ఎపిజిబి నిలిచింది. బ్యాంకు కేంద్రంగా మిగిలిన బ్యాంకులు కార్యకలాపాలు సాగించాలి. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలనుకోవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఎక్కడైన నష్టాల బాటలో పడిన సంస్థలను సంస్కరించడమో, విలీనం పేరుతో బలోపేతం చేయడమో చేయడం ఆనవాయితీ. మెరుగైన టర్నోవర్లతో బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్న బ్యాంకులను విలీనం పేరిట తరలించడ మేమిటనే వాదన వినిపిస్తోంది.

రాష్ట్రంలోని ఇతర గ్రామీణ బ్యాంకులతో విలీనం చేసి రాజధాని కేంద్రమైన అమరావతికి తరలించాలని కుట్ర పన్నిందనే విమర్శలు బ్యాంకింగ్ వర్గాల నుంచి వినిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఏర్పాటు తరహాలో కదులుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కేంద్రంలోని ఎపిజిబి ప్రధాన కార్యాలయంలో 200 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అమరావతికి తరలిస్తే సదరు ఉద్యోగులు అమరావతికి వెళ్లాల్సి ఉంటుందనడంలో సందేహం లేదు. కేంద్ర ప్రభుత్వ అనుమతి నేపథ్యంలో ఆర్‌బిఐ ఆదేశాలతో ఎపిజిబి తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం జిల్లాలోని ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్‌బిఐ ఆమోదం, కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు కదిలే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎపిజిబి హెడ్‌క్వార్టర్స్ తరలించడం తగదు



ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని తరలించడం తగదు. డిఎఫ్ఎస్ గైడ్‌లెన్స్, బ్యాంకు పరిమాణం, ఆదాయం ఆర్జన, వ్యాపార కార్యకలా పాల రీత్యా ఎలా చూసినా తరలించడం సరికాదు.

- డి.మహ్మద్, ఎపిజిబి ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కడప.

ఎపిజిబి తరలిస్తే ఉద్యమిస్తాం



కడప ఎపిబిజిపి ప్రధాన కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యమిస్తాం. వెనుకబడిన ప్రాం తాలకు బ్యాంకులను మరింత చేరువ చేయాల్సిందిపోయి, రాయలసీమలో ఉన్న అరకొర సంస్థలను, కార్యాలయాలను అమరావతికి తరలించాలనే ఆలోచనలు మానుకోవాలి.

- డి.దస్తగిరిరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

జాబ్‌మేళాలో 35 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన వారితో వీరాంజనేయప్రసాద్

ప్రజాశక్తి-రాయచోటి

ఉచిత జాబ్‌మేళాలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తొగటవీర క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా మోడెం చిన్నప్ప చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగుల సౌకర్యార్థం ప్రతి నెల 4వ శుక్రవారం జాబ్ మేళా నిర్వహణలో భాగంగా మొదటి విడతగా పట్టణంలోని మదనపల్లి రోడ్డులోని ఆయన కార్యాలయంలో వీరాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత మెగా జాబ్ మేళాను నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుండి వచ్చిన 157 మంది నిరుద్యోగులకు వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపికలను చేపట్టారు. ఈ సందర్భంగా వీరాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గమైన రాయచోటి ప్రాంతంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ ముందడుగు వేస్తోందన్నారు. మొదటగా హీరో, మోటో కార్ప్, డైకిన్, వింగ్ టెక్, నియోలినిక్, ఇన్సిలూమ్ వంటి ఐదు కంపెనీల ద్వారా నెలకు రూ.14 వేల నుండి రూ.21 వేల జీతంతో శ్రీసిటీ, రేణిగుంట, మంబట్టులలో పనిచేసే విధంగా 35 మంది నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ, యువతీ యువకులు మోడెం చిన్నప్ప చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి నెల జరిగే ఈ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆయన సూచించారు. ఏదైనా సమాచారం కోసం నిరుద్యోగ యువతీ, యువకులు 9652285027 అనే నెంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఒబిసి మోర్చా జనరల్ సెక్రటరీ వెంకటరమణ గౌడ్, మాజీ ఎంపిపి మోడెం నాగభూషణం పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో ఉచిత నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలను కళాశాల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత ప్రారంభించారు. రాజంపేటకు చెందిన అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్య బృందం అయిన రీజనల్ హెడ్ డి.సంతోష్, బిజినెస్ డెవలపర్ ఎన్.బాలాజీ, సీనియర్ కంటి వైద్యులు ఎం.వెంకటేష్, టి.సాయి పూజిత కళాశాలలోని సుమారు 300 మంది విద్యార్థులు, సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ అన్ని ఇంద్రియాలలోకి కన్ను ప్రధానమైనదని, ఈ అవయవాన్ని తరచూ వైద్య పరీక్షలు చేయించుకుని సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారి ఎన్.ప్రదీప్ కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

26న మహాధర్నాను విజయవంతం చేయాలి

- కార్మిక, రైతు సంఘం నాయకుల పిలుపు



రాజంపేట : మహాధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైతాంగం కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న రాయచోటి లోని కలెక్టరేట్ కార్యాలయం ముందు నిర్వహించబోవు మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వసంపదలు సృష్టించి ప్రజలకు అన్నం పెట్టేది కార్మిక, రైతాంగమేనని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా కార్పొరేట్లు, పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రైతుల ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చు కుటుంబ శ్రమ విలువకు మరో 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని, విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ విధానం రద్దు చేయాలని, చేతి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని, తదితర డిమాండ్లపై 26న జరగబోవు మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ ఓబయ్య, రమణ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వాల్మీకిపురం/గుర్రంకొండ : ఈ నెల 26న రైతు, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు విఠలం రమణారెడ్డి అన్నారు. గుర్రంకొండ మండలం వంకాయలవారిపల్లి, వాల్మీకిపురం పట్టణంలో మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. రైతు, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి రామచంద్ర, జిల్లా కన్వీనర్ రమేష్ బాబు, సిఐటియు నాయకులు మధురవాణి, చంద్రమ్మ పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం చూపొద్దు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సుండుపల్లి : ఎంపిపి స్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-సుండుపల్లె/వీరబల్లి

వేగం, నాణ్యత, నిష్పక్షపాతం, చట్ట ప్రకారం పిజిఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సుండుపల్లి, వీరబల్లి ఎంపిడిఒ కార్యాలయాల్లో సిఎంఒ, పిజిఆర్ఎస్ దరఖాస్తులు, విద్యార్థులకు అపార్ ఐడి జనరేషన్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఇండ్ల నిర్మాణ ప్రగతి, ఎన్‌సిపిఐలో బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్ అంశాల్లో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, డిటిలు, విఆర్‌ఒలు, గ్రామ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఎంలు, ఇతర మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశ నిర్దేశం చేశారు. ఆయా అంశాలలో ప్రగతి బాగానే ఉందని అధికారులను కలెక్టర్ అభినందించారు. లక్ష్యాలలో మరింత మెరుగైన సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో వేగవంతంగా, నాణ్యతగా చట్ట ప్రకారం నిష్పక్షపాతంగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి సిఎంఒ, పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులపై అదే రోజు లేదా మరుసటి రోజు క్షేత్రస్థాయిలో అర్జీదారులను కలిసి ఖచ్చితమైన విచారణ చేయాలని తెలిపారు. పిటిషనర్‌తో విఆర్‌ఒ, ఆర్‌ఐ, తహశీల్దారు తప్పనిసరిగా మాట్లాడాలన్నారు. ఏదైనా అంశంలో నోటీస్ ఇవ్వాల్సి ఉంటే చట్టప్రకారం నోటీసు ఇచ్చి గడువు దాటిన వెంటనే దాని పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ సర్వీసులు ఒక్కటి కూడా బియాండ్ ఎస్ఎల్ఎ పరిధి దాటరాదన్నారు. చుక్కల భూములు ఇనాం భూములు ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ పరిశీలన వేగంగా, పారదర్శకంగా పక్కాగా విచారణ చేసి పరిష్కరించాలని చెప్పారు. ఏదైనా తిరస్కరిస్తే అందుకు సంబంధించి సరైన కారణాలు పేర్కొనాలన్నారు. భూముల సర్వే కొరకు దరఖాస్తులు అందితే ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, పోరంబోకు తదితరాలకు ఉచితంగా సర్వే చేయాలన్నారు. పట్టా భూములు, ప్రయివేట్ భూములకు సంబంధించి ఎఫ్ లైన్ దరఖాస్తు ఫీజు కట్టించి నిర్ణీత కాల పరిధిలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. అపార్ ఐడి జనరేషన్‌ను వందశాతం పూర్తి చేయాలని సూచించారు. హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌లో ప్రగతి బాగానే ఉందన్నారు. గృహ నిర్మాణ ప్రగతిపై రెండు రోజులకు ఒకసారి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించాలని ఎంపిడిఒలకు సూచించారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని సూచించారు. ప్రజలందరికీ ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తోందన్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో అవసరం మేరకు ఇసుకను తీసుకెళ్లవచ్చని తెలిపారు. సమీక్ష సమావేశం అనంతరం సుండుపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. నేటి మెనూ ఎలా ఉంది? మెనూలో ఏ పదార్థాలు ఉన్నాయి? వాటి నాణ్యత గురించి కలెక్టర్ పరిశీలించారు. భోజన నాణ్యతపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా అక్కడి పిల్లలకు కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించారు. అక్కడి ఆవరణలో గల అంగన్వాడి కేంద్రాన్ని కూడా ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. వీరబల్లి మండలం తాటిగుంటపల్లె ఎంపిపి స్కూల్ సమీపంలో ప్రయివేటు పట్టా భూమి సమస్య గురించి పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మట్లి తోగటపల్లిలో చేపట్టిన 95 మీటర్ల పొడవు మూడు మీటర్ల వెడల్పుతో రూ.3.2 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న బిటి రోడ్డును పరిశీలించారు. సమావేశంలో డ్వామా, హౌసింగ్ పీడీలు వెంకటరత్నం, శివయ్య, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, హౌసింగ్ ఎఇలు, డిటిలు, ఆర్‌ఐలు, విఆర్‌ఒలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రహదారి భద్రతా సూత్రాలను పాటించాలి

- ఎంవిఐ విజయకుమారి



మాట్లాడుతున్న ఎంవిఐ విజయలక్ష్మి

ప్రజాశక్తి-పీలేరు

రహదారి భద్రతా సూత్రాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని పీలేరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయ కుమారి తెలిపారు. శుక్రవారం పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువత వేగమే ప్రధానంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని, వేగం కన్నా భద్రత చాలా ముఖ్యమని, వాహన వేగాన్ని నియంత్రిస్తూ తమ భవిష్యత్తును బంగరు మయం చేసుకోవాలని కోరారు. వాహనాలు నడిపే సమయంలో రోడ్డు భద్రతా సూచనలు పాటిస్తూ ప్రమాదాల నివారణ తమ వంతు కర్తవ్యంగా భావించాలని పేర్కొన్నారు. పీలేరు అర్బన్ ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చదువుతో పాటు సంస్కారాన్ని, రోడ్డు భద్రత పట్ల అవగాహనను పెంచుకోవాలని సూచించారు. తాను పొందిన అవార్డులు, రివార్డులు, అనుభవాల గురించి ఉత్తేజపూర్వకంగా ప్రసంగించారు. అన్నమయ్య జిల్లా రోడ్డు భద్రత కమిటీ సభ్యులు, షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్.లక్ష్మి, న్యాయ సలహాదారు డాక్టర్ రాయల సుధాకర్ రాయలు మాట్లాడుతూ ప్రయాణ సమయంలో మెళకువలు పాటించాలని, మానసిక ప్రశాంతత కూడా కలిగి ఉండాలని, అందుకు యోగా సహకరిస్తుందని తెలియజేశారు. ఆందోళన చెందకుండా ప్రశాంత మనసుతో వాహనాన్ని నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. రేగళ్ళు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను పాటించాలని, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు బాధితులను ఫస్ట్ గోల్డ్ అవర్స్‌లోనే ఆసుపత్రిలో చేర్చినట్లైతే వారి ప్రాణాన్ని కాపాడిన వారం అవుతామని పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ బండ్ల కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని తెలియజేశారు. కారు వంటి వాహనాలు నడిపే సమయంలో సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టాలని తెలియజేశారు. ఎం.జె.ఆర్.ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.మాధవీలత మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి, పౌరులు తప్పనిసరిగా నిర్ణీత వయస్సులో ఉన్నప్పుడు ప్రభుత్వం ద్వారా ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుని తమ ప్రయాణాలను సాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంజెఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ కెవిఎన్ రావు, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

టౌన్ బ్యాంక్ చైర్మన్‌గా 'నాదెళ్ల' ఎన్నిక లాంఛనమే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



నామినేషన్ దాఖలుచేస్తున్న నాదెళ్ల విద్యాసాగర్

మదనపల్లె టౌన్ బ్యాంకు చైర్మన్‌గా నాదెళ్ల విద్యాసాగర్ ఎన్నిక లాంఛనమే కానుంది. మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఎన్నికల నిర్వహణకు శుక్రవారం ఎన్నికల అధికారి దుర్గమ్మ నామినేషన్లను స్వీకరించారు. చైర్మన్ రేసులో ఉన్న నాదెళ్ల విద్యాసాగర్‌తో పాటు ఆయన ప్యానెల్‌లో ఉన్న ఎన్‌వి.శివ ప్రసాద్, ఎస్.భాస్కర్ కుమార్, ఎన్.ముక్తియార్ ఖాన్, ఎస్.రవికాంత్, ఆర్.సోమశేఖర్, ఎస్.రవీంద్రనాథ్ ఎ.కృష్ణమూర్తి, పి.సర్దార్ ఖాన్, డి.నిరంజన్, ఆర్.భాస్కర్, జె.దేవేంద్ర మాత్రమే డైరెక్టర్లుగా నామినేషన్లు వేశారు. పాలకమండలికి అవసరమయ్యే 12 మంది మాత్రమే నామినేషన్లు వేయడంతో ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో విద్యాసాగర్ ప్యానల్ మాత్రమే ఎన్నికల బరిలో ఉండడంతో ఆయనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎన్నికల అధికారి దుర్గమ్మకు విద్యాసాగర్‌తో పాటు 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నిర్ణీత గడువులోగా మరెవ్వరు నామినేషన్లు వేయకపోవడంతో నాదెళ్ల విద్యాసాగర్ ప్యానల్‌ను ఎన్నికల అధికారి దుర్గమ్మ ఆమోదించారు. నామినేషన్ల స్క్రూటిని, ఉపసంహరణల అనంతరం ఈ 12 మంది సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎంపిక చేసుకోనున్నారు.

వైసిపి శ్రేణులపై పెరిగిన దాడులు : నిస్సార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తెలుగుదేశం పార్టీ రెడ్ బుక్ సంస్కృతిని తీసుకువచ్చి గ్రామాలలో విషపుబీజాలు నాటడంతో కక్ష్యలు, దాడులకు ఆజ్యం పోస్తున్నారని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ వారి దాడిలో గాయపడిన మదనపల్లె మండలం మునగమాకులపల్లెకు చెందిన గంగులమ్మ, బాలకృష్ణలను శుక్రవారం మదనపల్లె సర్వేజన ప్రభుత్వ ఆసుపత్రిలో నిస్సార్ అహమ్మద్, వైసిపి నాయకులు పరామర్శించి, దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిసార్ అహమ్మద్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ సంస్కృతి పెచ్చుమీరడంతో గ్రామాలలో ప్రశాంతత కరువైందన్నారు. టిడిపి వారి దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనవసరంగా ఘర్షణలకు దిగడం, దాడులు చేయడం టిడిపి శ్రేణులకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. టిడిపి విష సంస్కృతిని అడ్డుకుంటామని, ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి వైసిపి కార్యకర్త ధైర్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న నిస్సార్ అహమ్మద్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి రాయచోటి

పర్యావరణ పరిరక్షణకు వ్యర్థ పదార్థాల సక్రమ నిర్వహణ, ఇంకుడు గుంతల తవ్వకం ఎంతైనా అవసరమని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఇంకుడు గుంతల తవ్వకం పై పాఠశాల విద్యార్థులు ఇంటింటి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సర్వేలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు వారు విలువైన క్రీడా, విద్యాసంబంధ బహుమతులు అందించారన్నారు. బహుమతులు పొందిన వారిలో సీనియర్ విభాగంలో 9వ తరగతి మానస, పవన్ గణేష్, 8వ తరగతి మౌనిక, జూనియర్ విభాగంలో 6వ తరగతి తేజస్విని, రెడ్డి మనస్విని, 7వ తరగతి పజిల్ లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మయ్య, పాఠశాల కో-ఆర్డినేటర్ రెడ్డి శేఖర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విజయ భాస్కర్, దేవ ప్రసాద్ రెడ్డి, రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

'యువ ఉత్సవ్' పోటీల్లో పాల్గొనండి : సెప్ట్ సిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

యువత జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని యువజన సర్వీసుల శాఖ స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయి గ్రేస్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల వారి సంయుక్త ఆధ్వర్యంలో కడప రోడ్డులోని భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల చివరి వారంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ యువజనోత్సవాలలో ఇండియా ఏ2047 అనే అంశం పై పెయింటింగ్ , కవితవ్యం /వ్యాస రచన ,మొబైల్ ఫొటోగ్రఫీ ,డిక్లమేషణ్, ఫోక్ డాన్స్ (గ్రూప్) భాగాలలో వ్యక్తిగత పోటీలు, సైన్స్ ఎక్విబిషన్ గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయని, ఈ పోటీలు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి పంపబడును గెలుపొందిన, ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని 15 నుండి 29 సంవత్సరముల వయస్సు గల యువత ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకొని, యువజనోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. యువజనోత్సవాలలో తమ పేర్లు నమోదు చేసుకోవడానికి ఈ లింక్ https://tinyurl.com/DYFANMY 2024ను ఉపయోగించు కోవాలన్నారు. ఇతర వివరాములకు స్టెప్, మేనేజర్ 9949298810, 8008819556 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పుల్లంపేటలో హిందూ శ్మశాన వాటిక స్థల ప్రహరీని కూల్చివేసిన భూ ఆక్రమణదారులపై వెంటనే కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఘటన స్థలాన్ని పరిశీలించిన తర్వాత ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 280లోని 6 ఎకరాల 20 సెంట్లు హిందూ, ముస్లిముల శ్మశాన వాటిక ప్రహరీని గత వైసిపి ప్రభుత్వంలో ఐదు లక్షల వ్యయంతో నిర్మించామని తెలిపారు. కొంతమంది భూ ఆక్రమణదారులు కలిసి శ్మశాన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించారని వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా హింసలు పెరిగి మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని అన్నారు. కూటమి నాయకులు శ్మశానాలను కూడా వదలడం లేదని అన్నారు. భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సంఘటన స్థలం నుంచి సబ్ కలెక్టర్, డిఎస్పికి ఫోన్ ద్వారా తెలిపామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, వైస్ఎంపిపి ధ్వజారెడ్డి, జడ్పిటిసి రామనాథం, మండల కన్వీనర్ ముస్తాక్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుకు మరో అవకాశం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఓటరు జాబితా నవీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ ధనుంజయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఫొటో ఓటర్ల జాబితా నిరంతర నవీకరణ ప్రక్రియను పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు శనివారం, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటు విలువపై అవగాహన కల్పిస్తారని అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం వంటి సవరణలు చేపడతారని వివరించారు. ఇదివరకే నవంబర్ 9వ, 10వ తేదీలలో 18 ఏళ్ళ నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇది మంచి అవకాశమని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ లక్ష్మీపతి

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని డిఎల్‌డిఒ లక్ష్మీపతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువు పట్ల మక్కువ పెంచుకొని భయభ్రాంతులకు గురికాకుండా పరీక్షలకు తర్ఫీదు కావాలని సూచించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అనంతరం భోజనాలను మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయంలో టివి, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని వండాడి గ్రామం,గొర్లముడివీడు నుంచి తూర్పు పల్లె వరకు కోటి రూపాయల పైన నిధులతో దాదాపు 1.65 కిలోమీటర్లు బిటి రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం టిడిపి యువ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి రోడ్డును పరిశీలించారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి ఇప్పటికీ కొద్ది నెలలు అయినప్పటికీ నియోజకవర్గంలో ప్రతి మండలంలో దాదాపుగా రెండు కోట్లకు పైగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి మండలంలో దాదాపుగా మూడు నుంచి నాలుగు కోట్లకు పైన మట్టి రోడ్ల నిర్మాణాలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు.

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తనిఖీ

ప్రజాశక్తి-కలికిరి : కలికిరి మేజర్ పంచాయతీలో స్వర్ణ పంచాయతీ యాప్‌లో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ డిజిటలైజేషన్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని కలికిరి ఇఒపిఆర్‌డి మహమ్మద్ రియాజుద్దీన్ శుక్రవారం పరిశీలించారు. ఇటీవల డిపిఒ బాలకృష్ణ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి కలికిరి మేజర్ పంచాయతీలో స్వర్ణ పంచాయతీ హౌస్ హోల్డ్ మ్యాపింగ్ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ ఇఒ. జి.అశోక్ ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని అన్ని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లను ఒక చోట చేర్చి శుక్రవారం డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు.

దోమ కాటు ప్రమాదకరం

ప్రజాశక్తి-పీలేరు: దోమ దినసైనా సంభవించే ఆరోగ్య సమస్యలు ప్రాణాంతకమైనవేనని సబ్ యూనిట్ అధికారి విద్యా సాగర్ తెలిపారు. శుక్రవారం తలుపుల పిహెచ్‌సి వైద్య సిబ్బంది తలుపుల పంచాయతీ, చెరు కువారి పల్లెలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెల్త్ కొండయ్య సంయుక్తంగా మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించు వ్యాధుల నియంత్రణపై ప్రజల్లో అవగాహన అవసరమని అన్నారు. దోమల పుట్టుకను, కట్టుకుండా చేసి దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులను కారణ మైన దోమ కాటు నుంచి రక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం రెడ్డెమ్మ, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కలకడ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నడిమిఖండ్రివారిపల్లి, బొజ్జిగుట్టపల్లి లలో నిర్వహిస్తున్న అసంక్రమిత వ్యాధులు, డ్రై డే సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఈ అసంక్రమిత వ్యాధులైన కేన్సర్, షుగర్, బిపి, థైరాయిడ్, గుండె జబ్బులు, ఊబకాయం వంటివి ఈమధ్య కాలంలో ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. మారుతున్న జీవనశైలి, యాంత్రిక జీవనానికి అలవాటు పడటం వల్లే ఈ వ్యాధుల బారినపడుతున్నారని అన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి ఇంటింటి కేన్సర్ స్క్రీనింగ్ సిహెచ్ఒలు, ఎఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి రొమ్ము, గొంతు, నోటి, జననేంద్రియ కేన్సర్‌పై భౌతికంగా పరీక్షలు చేసి అనుమానం ఉన్న వారిని వైద్యులకు రెఫర్ చేస్తారని తెలిపారు. వైద్యులు పరీక్షల అనంతరం మళ్లీ అనుమానం ఉంటే జిల్లా ఆస్పత్రికి ఆశా కార్యకర్తలను వెంట పెట్టి రెఫర్ చేస్తామని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తే దోమలను నాశనం చెయ్యవచ్చు అన్నారు. ఫలితంగా మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాల వ్యాప్తిని అరికట్టవచ్చని పిలుపునిచ్చారు. ప్రతీ గర్భిణి ఆయుష్మాన్ భారత్, హెల్త్‌కార్డు ఐడిని లింక్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ, రామకృష్ణ యాదవ్, ఎంపిహెచ్ఇఒ, హెచ్‌ఇఒ, జయరామయ్య ఎస్.వి.రమణమ్మ, డి.వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి రాజుస లోచన, ఆశాలు జి.వెంకట లక్ష్మి, డి.రెడ్డమ్మ పాల్గొన్నారు. **కలికిరి:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కావ్యగంధ అన్నారు.104 సేవలలో భాగంగా డాక్టర్ కావ్యగంధ పర్యవేక్షణ లో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ కాలానుగున వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇటీవల వర్షాలు కురవడం వల్ల వాతావరణంలో మార్పులు వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. చేతులు పరిశుభ్రత, పరిసరాల శుభ్రత పాటించాలని తెలిపారు. వర్షపు నీరు ఇళ్ల పరిసరాలలో నిల్వ లేకుండా చూసుకోవాలి అన్నారు. ఇలాంటి నిల్వ నీటిలో దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెంది జ్వరాల ప్రాబల్యం పెరిగే అవకాశం ఉందన్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినరాదని అన్నారు.ఎప్పటికప్పుడు వేడి ఆహారం తినాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లలో క్లోరినేషన్ పంచాయతీ వారి సహాయంతో చేయించిన నీటినే తాగాలని తెలిపారు. నీళ్ళ విరోచనాలకు అన్ని గ్రామాల్లో ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఒఆర్ఎస్ పాకెట్స్ నిల్వ ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ముజీబ్, ఎఎన్ఎం పార్వతి,104 సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

ఉద్యోగులను తొలగించడం అన్యాయం : వైసిపి



ఎపిఎండిసి సిపిఒ మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎపిఎండిసి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులు దాదాపు 150 మందిని తొలగించడం దుర్మార్గమైన చర్యని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డితో కలిసి ఎపిఎండిసి సిపిఒ సుదర్శన్‌రెడ్డిని కలిసి తొలగించిన ఉద్యోగస్తుల గురించి చర్చించారు. తొలగించిన ఉద్యోగస్తులను తిరిగి విధుల్లోకి తీసుకోక పోతే న్యాయపోరాటం చేస్తామని అన్నారు. గతంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ సహకారంతో మంగంపేటకు సంబంధించి దాదాపు రూ.350కోట్లతో అభివృద్ధి పనులు చేశామని అన్నారు. ఎపిఎండిసి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులను కూడా తీసివేయడం బాధాకరమని పేర్కొన్నారు. తొలగించిన ఉద్యోగుస్తులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేనియెడల రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని దానికి మంగంపేట నుంచే బీజం పడుతుందని వారు హెచ్చరించారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం యల్లటూరు భవన్‌లో రాజంపేట మున్సిపాలిటీ 13వ వార్డ్ వైసిపి ఇన్‌ఛార్జి కొనిశెట్టి రెడ్డయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రాజంపేట పట్టణ యువత అధిక సంఖ్యలో జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. శ్రీనివాసరాజు అందరికీ కండువాలు వేసి జనసేన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రెడ్డయ్య మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదర్శవంతమైన పరిపాలనా విధానం, యల్లటూరు శ్రీనివాసరాజు నాయకత్వం, ఆయన మీద ప్రజలకున్న అభిమానంతో జనసేనలో చేరామని అన్నారు. నమ్మకమే కాకుండా విద్యా వంతులు.. పదవుల కోసం కాకుండా ప్రజలకు అండగా నిలబడే విధానం గత కొన్ని రోజులుగా చూసి ఆయన నాయకత్వంలో పనిచే యాలని నిర్ణయించు కున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, గుణకల చిన్న, అడపాల ప్రసాద్, యుగంధర్, మోహన్, ఆకాష్, పివిఆర్ కుమార్, పెడకాల సుధాకర్, వీరయ్య, శ్రీ రాములు, రాజశేఖర్, నారదాసు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరాజు

దళితుల ఇంటి పట్టాలపై రీసర్వే చేయించండి



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న పంతగాని ప్రసాద్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు మండలంలోని ఉర్లగడ్డ పోడు, సమతా నగర్ గ్రామాలలో ఎన్నో సంవత్సరాల క్రితం ఇంటి పట్టాలను ఇచ్చారని అయితే వాటిని రీసర్వే చేసి అర్హులైన బాధితులకు ఇవ్వాలని రైల్వేకోడూరు టిడిపి యువ నాయకులు పంతగాని నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మహబూబ్‌చాంద్‌తో కలిసి చర్చించారు. చాలా కాలం నుంచి డికెటి పట్టాలు ఇచ్చారని అప్పట్లో ఆన్‌లైన్ చేయకుండానే పూర్తిస్థాయిలో పట్టాలను మంజూరు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఇంటి పట్టాలను మంజూరు చేసి దళితులను ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా రైల్వే కోడూరు ప్రాంతంలో వైసిపి ప్రభుత్వంలో ఎన్నో భూ ఆక్రమణలు జరిగాయనిఅన్నారు. కార్యక్రమంలో మందపాటి శంకరయ్య, కస్తూరి దినేష్, చిగురుపాటి శంకంతో పాటు బుడుగుంటుపల్లి, ఉర్లగడ్డపాడు గ్రామాలకు చెందిన టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యాన పట్టాకు ఉద్యోగ అవకాశాలు మెండు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

ఉద్యానకళాశాలలో పొందిన డిగ్రీ పట్టాకు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో అవకాశాలు ఉన్నాయని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిటిశ్రీనివాస్, ఎస్‌వియూ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌వి సురేష్ కుమార్ తెలిపారు. మండలంలోని అనంతరాజుపేటలోని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన కళాశాలలో 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్‌సి హార్టికల్చర్ డిగ్రీ కోర్స్ పూర్తి చేసి పట్టాతో బయటికి వెళ్తే నేవీ, అన్ని రకాల పోటీ పరీక్షలతో పాటు, ప్రయివేట్, ప్రభుత్వ శాఖలలో ఎన్నో రకాల ఉద్యోగాలకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. చాలామంది ఉద్యాన పట్టా కేవలం డిగ్రీ కాగితపు ముక్క అనుకుంటారని కానీ పట్టాతో బయటకు వెళితే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రంగాలలో మెరుగైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థులందరూ మొదటి నుంచే మంచి క్రమశిక్షణ అలవరచుకుని తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలుగుతూ కష్టపడి ఇష్టంతో విద్యను అభ్యసించాలని అన్నారు. .ప్రతిభ ఉంటే ఏ రంగంలోనైనా విజయం తధ్యమని విద్యార్థులకు గుర్తు చేశారు.ఉద్యాన శాఖ పరంగా తనకు కూడా 44 సంవత్సరాల అనుభవం ఉందని వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్ కుమార్ తెలిపారు. ఇప్పటి కూడా నేను శాఖాహారని అని తెలిపారు.తనకు ఏవైనా పండ్లు వెజిటబుల్స్ కావాలంటే ఎప్పటికీ ఈ ఉద్యాన కళాశాలకే వచ్చి తీసుకు వెళ్తూ ఉంటానని తెలిపారు. రాబోయే రోజుల్లో ఉద్యాన, వ్యవసాయ కోర్సులు పూర్తిచేసి పట్టాలు పొందిన వారికి మెరుగైన అవకాశాలు ఉంటాయని వివరించారు కార్యక్రమంలో కళాశాల ఒఎస్ఎ డాక్టర్ సయ్యద్ సదరున్నీషా, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యాన కళాశాలలో ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న డీన్ డాక్టర్ పిటి శ్రీనివాస్



మాట్లాడుతున్న సుప్రియ

పిల్లల దత్తతపై అవగాహన

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం బాల బాలికల సంరక్షణలో భాగంగా అన్నమ య్య జిల్లా శిశు గృహ ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో మండల సమాఖ్య సమావేశంలో పాల్గొని అంతర్జాతీయ దత్తత మాసోత్సవ అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్. సుప్రియ మాట్లాడుతూ దత్తత ప్రక్రియ, దత్తత కొరకు కావలసిన పత్రాలు, బాలలను దత్తత తీసుకునే తల్లిదండ్రులు ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించాలని సూచించారు. అక్రమంగా దత్తత ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరమని అలా చేసిన వారిపై చట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఎవరైతే పిల్లలు లేని తల్లిదండ్రులు ఉంటారో వారికి ప్రేమను పంచే కుటుంబాన్ని ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. పిల్లలకుఎటువంటి సమస్యలు ఉన్న 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని అన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్ ఆర్.సుప్రియ, శిశు గృహ సోషల్ వర్కర్ టి.గాయత్రి, ఎపిఎం పి.రెడ్డమ్మ, విఒలే, సిసిలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా గృహాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలకడ

నూతన పక్క గృహాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పగి నాగమునినాయక్ పేర్కొన్నారు.మండలంలో ఇంతవరకు ఇల్లు లేని నిరుపేదలు పీఎం ఏవై పథకం కింద దరఖాస్తు చేసుకుంటే వారికి నూతన గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.దరఖాస్తులను స్థానిక సచివాలయాలలో కానీ లేదా హౌసింగ్ కార్యాలయంలో గాని ఇవ్వాలని ఆయన కోరారు. అర్హులైన లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-రామాపురం

జిల్లా స్థాయిలో నిర్వహించే త్రోబాల్ పోటీలకు నీలకంఠరావుపేట జడ్పి హై స్కూల్(తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముక్కవారిపల్లి ఎపి రెసిడెన్షియల్ స్కూల్ లో జిల్లాస్థాయి త్రో బాల్ పోటీలు ఎంపికలో మండలంలోని నీలకంఠ రావుపేట జడ్పిహై స్కూల్ విద్యార్థులు అండం-14 విభాగంలో జి.నాగ చైతన్య, కె.పవనేష్, వి.బాబుస్టాండ్ బైగా వెంకటరామయ్య అండర్- 17 విభాగంలో ఎన్.హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యార్థులు త్రోబాల్ పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయికి ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి పీడీ నరేంద్ర కుమార్ రెడ్డిని అభినందించారు.



జిల్లా స్థాయి త్రోబాల్‌కు ఎంపికైన విద్యార్థులతో పీడీ

50 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కడపకు చెందిన శ్రీసాయి నరసింహహోం ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ స్రవంతిరెడ్డి పేర్కొన్నారు. ఆపరేషన్ అవసరమైన 28 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం పట్ల లక్కిరెడ్డిపల్లి మండల యువ నాయ కుడు యనమల మదన మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో వెనకబడినటువంటి రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం వలన సుదూర ప్రాంతాలకు వెళ్ళకుండా న్యాయ సమ స్యలు త్వరతగిన పరిష్కరించుకొని ప్రజలు సమస్యల నుంచి ఉపశమనం పొంద వచ్చన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెనుకబడినటువంటి జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలుకండి

ప్రజాశక్తి-పీలేరు

రక్తదానం చేసి మరికొందరికి ప్రాణదాతలవ్వండని పీలేరు అర్బన్ సిఐ యుగంధర్ తెలిపారు. శుక్రవారం పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ వెంకట రామయ్య ఆధ్వర్యంలో 76వ ఎన్‌సిసి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన విద్యార్థి ప్రతి మూడు నెలలకు ఓ సారి రక్తదానం చేయవచ్చని అన్నారు. రక్తనిధి కేంద్రాల్లో రక్తం నిల్వల కొరత లేకుండా ఉంటుందని చెప్పారు. విద్యార్థులచే సేకరించిన రక్తాన్ని అత్యవసర సమయాల్లో బాధితులకు వినియోగించాలని సిఐ రక్తనిధి కేంద్ర నిర్వాహకులను సూచించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని దానం చేసిన 46 మంది ఎన్‌సిసి విద్యార్థులను సిఐ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శివానంద రెడ్డి, పీలేరు, మదనపల్లె ప్రభుత్వానువత్రుల రక్తనిధి కేంద్ర నిర్వాహకులు మునాఫ్, సునీత, ఉమాశంకర్, అమరావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైవీయూతో కేరళ క్రైస్ట్ కళాశాల ఒప్పందం

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగివేమన విశ్వ విద్యాలయం ఎర్త్ సైన్సెస్ విభాగం (భూశాస్త్రవిభాగం) కేరళలోని ఇరింజలగూడ, క్రైస్ట్ కాలేజ్(అటానమస్) జియాలజీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. యోగివేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ పి. పద్మ ఎర్త్ సైన్సెస్ హెచ్‌ఒడి ఆచార్య తుమ్మలకుంట శివ, డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, ప్రొఫెసర్ క్రిస్ట్ కాలేజ్ ఆచార్యులు లింటో అలప్పట్ డాక్టర్ రేష్మి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అకడమిక్‌గా, పరిశోధనలపరంగా పరస్పర ప్రయోజనాల కోసం ఎంఒయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. జియో లాజికల్‌గా కడప బేసిన్ ఎంతో ప్రాధాన్యత కలదని తమ విద్యార్థులు పరిశోధనలు అలానే సాంకేతిక పరంగా ప్రయోజనాలు పొందుతారని అభిప్రాయం వ్యక్తంచేశారు. క్షేత్రస్థాయి సందర్శన, స్ట్రాటిగ్రఫీ హైడ్రోజియాలజీ, నీటి వనరుల మోడలింగ్ పై వైవీయూ, అలానే క్రైస్ట్ కళాశాల విద్యార్థులు, పరిశోధకులు పరస్పర అవగాహన పొందుతారని తెలిపారు.



విసిని అభినందిస్తున్న అతిథులు

క్రైం కార్నర్

నాటుసారా నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ద్విచక్రవాహనంలో అక్రమంగా నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ భీమలింగ తెలిపారు. మండంలోని మాలేపాడు క్రాస్ వద్ద శుక్రవారం ఎక్సైజ్ ఎస్ఐలు డార్కస్, జెబి వుల్లా సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా, నారమాకుల తండాకు చెందిన రవినాయక్ బైకులో 190లీటర్ల నాటు సారా తీసుకుని మదనపల్లికి వెళ్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. సారాను సీజ్ చేసి, కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని తెలిపారు.



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె అర్బన్ : కర్ణాటక మద్యం అమ్ముతున్న మహిళను అరెస్టు చేసినట్లు మదనపల్లి ఎక్సైజ్ సీఐ భీమలింగా తెలిపారు. కురబలకోట మండలం తెట్టు గ్రామానికి చెందిన పద్మావతి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి స్థానికులకు విక్రయి స్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి ఆమె ఇంట్లో సోదాలు చేసి నట్లు తెలిపారు. ఈ సోదాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 76 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు అనంతరం అరెస్టు చేశామని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడిపై దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె వారపు సంతలో ఉన్న అన్న క్యాంటీన్‌లో భోంచేసి వస్తున్న భవన కార్మికుడిపై ఓ వ్యక్తి ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈ సంఘటన గురువారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. బాదితుని కథనం మేరకు..స్థానిక ఎస్‌బిఐ కాలనీలో నివాసముంటున్న నగేష్ భవన కార్మికుడు. స్థానిక వారపు సంత వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో భోంచేసి బయటకు వచ్చిన నగేష్ సైకిల్ వద్దకు వెళ్ళగానే అక్కడే ఉన్న ఓ వ్యక్తి ఇనుప రాడ్డుతో దాడి చేసి తలపై కొట్టాడు. తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న బాధి తుడిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన వ్యక్తి పరారీలో ఉండ డంతో ఎవరన్నదీ తెలియరాలేదు. రెండో పట్టణ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.